• వైనాట్ 175 నుంచి 92కి..!

అంతర్గత సర్వేతో డీలా..
కౌంటింగ్‌కు ముందే ఓటమి భయం
మద్దతుగా నిలవాలని స్వతంత్ర ఏజెంట్లతో బేరసారాలు

వైసీపీలో కౌంట్‌డౌన్..!





ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు.. వైనాట్ 175 అంటూ సీఎం జగన్ బీరాలు పలికారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలూ గెలుస్తామని ప్రగల్భాలు పోయారు. షెడ్యూల్ విడుదలయ్యాక స్వరం మారింది. వైసీపీ నేతలు 150 సీట్లు తమవేనన్నారు. పోలింగ్ తర్వాత ఆ సంఖ్య మరింత తగ్గింది. 120 సీట్లయినా గెలుస్తామన్నారు. తాజాగా ఆ పార్టీ అంతర్గత సర్వేలో 92 సీట్లకు పరిమితం కానున్నట్లు తెలిసిందట. ఇదే విషయాన్ని పార్టీ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేస్తున్నట్లు సమాచారం. మ్యాజిక్ ఫిగర్ దాటుతామనీ, గట్టెక్కుతామంటూ డీలాపడిన శ్రేణుల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారట. 92 నంబర్ చూడగానే.. శ్రేణులు డీలాపడిపోతున్నాయి. కౌంటింగ్‌కు ఇంకా మూడు రోజుల సమయం ఉంది. ఈలోగా ఈ సంఖ్య ఇంకా ఎంతకు పడిపోతుందోనన్న చర్చ అధికార పార్టీ వర్గాల్లోనే సాగుతోంది. అంతర్గత సర్వేలోనే పరిస్థితి ఇలా ఉంటే.. వాస్తవంగా ఎన్ని సీట్లు వస్తాయోనన్న ఆందోళనలో ఆ పార్టీ వర్గాలున్నాయి. ఇలా కౌంటింగ్‌కు ముందే వైసీపీలో ఓటమి భయం వెంటాడుతోందన్న చర్చలు వినిపిస్తున్నాయి.

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఓట్ల లెక్కింపునకు మూడు రోజులే సమయం ఉంది. ఇప్పుడంతా ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. క్షణమొక యుగంలా గడుస్తోంది. ఏ ఇద్దరు కలిసినా ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. పెద్దఎత్తున సాగుతున్న బెట్టింగ్‌పై మాట్లాడుకుంటూనే జిల్లాలో ఏయే నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారన్న దానిపై విశ్లేషణలు చేస్తున్నారు. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ముఖ్య నాయకులు ఎవరు గెలుస్తారు, మెజార్టీ ఎంత వస్తుంది, రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి వస్తుందన్న అంశాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. చిన్న టీకొట్టు నుంచి షాపింగ్ మాల్స్‌దాకా ఎక్కడ చూచినా ఇదే చర్చ. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమికి ఏయే స్థానాలు వస్తాయి, ఎంత మెజార్టీ అన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్న నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్ కట్టలు తెగుతున్నాయి. వైనాట్ 175 అన్న వైసీపీ.. అంతర్గత సర్వేలో 92కి దిగివచ్చినట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. చివరకు వైసీపీలో సొంత పార్టీ వారే తమ అభ్యర్థులు ఓడిపోతున్నారనీ, ప్రత్యర్థి గెలుస్తున్నాడంటూ బెట్టింగ్ కడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కౌంటింగ్ కౌంట్‌డౌన్ దగ్గర పడేకొద్దీ వైసీపీలో టెన్షన్ పెరిగిపోతోంది. విహార యాత్రలకు వెళ్లిన అభ్యర్థులు, నాయకులు ఇళ్లకు చేరుకున్నారు. కౌంటింగ్ ఏజెంట్లతో సమీక్షలు మొదలుపెట్టారు. మొత్తంగా అందరిలోనూ జూన్ 4 టెన్షన్ నెలకొంది. సీఎం జగన్ ప్రతిసారీ 175 అసెంబ్లీ, అన్ని పార్ల

ఫలితం ముందే.. వైసీపీ విలవిల

మెంటు స్థానాలు తమవేనని ఊదరకొట్టారు. ఎన్నికల సభల్లోనూ ఇదే మాట నొక్కినొక్కి చెప్పారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత ఐప్యాక్‌తో సమావేశంలో గతం కంటే అధికంగా సాధిస్తున్నట్లు కలరింగ్ ఇచ్చారు. మరో మూడురోజుల్లో ఫలితాలు వెల్లడికాబోతున్న నేపథ్యంలో ఇప్పటికే సర్వేలు అన్నీ కూటమివైపు మొగ్గు చూపుతుండడంతో ఆ పార్టీల అభ్యర్థులు గెలుపు ధీమాతో ఉన్నారు. ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్న వారందరూ తమకే ఓటు వేశారన్న నమ్మకంతో గతం కంటే అధిక స్థానాలు గెలుస్తామని సీఎం జగన్‌తోపాటు ఆపార్టీ అభ్యర్థులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. వైసీపీ అంతర్గత సర్వేలో 92 స్థానాలు వస్తాయని వెల్లడైనట్లు సమాచారం. దీంతో వైసీపీ అభ్యర్థులతోపాటు పార్టీ శ్రేణులను ఓటమి భయం వెంటాడుతోంది. దీనిని బట్టి మళ్లీ అధికారంలోకి వస్తామన్న ఆశలు సన్నగిల్లినట్లు స్పష్టమౌతోంది. జిల్లాలో కూటమి కంటే తమకే అధిక స్థానాలు వస్తాయని వైసీపీ నేతలు లెక్కలేసుకుంటున్నారు. ఫలానా సీటు గెలుస్తామని మాత్రం చెప్పలేకపోతున్నారు. ఈనేపథ్యంలో వైసీపీలో తమ అభ్యర్థుల గెలుపుపై ఫలితాలకు ముందే ఆశలు సన్నగిల్లినట్లు స్పష్టమౌతోంది.

కౌంటింగ్ ఏజెంట్లతో బేరసారాలు

జిల్లాలో టీడీపీ కూటమి, వైసీపీ మధ్య పోటీ నెలకొంది. గెలుపుపై ఎవరి ధీమాలో వారున్నారు. లోలోపల మాత్రం టెన్షన్ పడుతున్నారు. ఎన్నడూలేని విధంగా ప్రస్తుత ఎన్నికల్లో భారీగా ఖర్చు పెట్టేశారు. కూటమిలో గెలుపు ధీమా కన్పిస్తుండగా వైసీపీలో నలుగురైదుగురు అభ్యర్థులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారనే చర్చలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుండడంతో వైసీపీలో ఆందోళన నెలకొంది. సర్వేలు కూటమికి అనుకూలంగా ఉన్నాయన్న వాదనల నేపథ్యంలో కౌంటింగ్‌లో తమ ఏజెంట్లపై ఒత్తిడి పడుతుందని వైసీపీ అభ్యర్థులు భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులతోపాటు మరికొన్ని పార్టీల తరఫున కౌంటింగ్ ఏజెంట్లను తమకు మద్దతుగా ఉండాలని బేరసారాలు సాగిస్తున్నారని తెలిసింది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థుల తరఫున వైసీపీ ఏజెంట్లను ఎంపిక చేసేందుకు బేరసారాలు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు కీలకం కానున్నాయి. ఎన్నడూలేని విధంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ శాతం పెరిగింది. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 20,091 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈలెక్కన ఏడు నియోజకవర్గాలకు సగటున మూడువేలదాకా పోస్టల్ బ్యాలెట్లు వస్తాయి. ఇందులో కూటమి అభ్యర్థులకు అనుకూలంగా ఓటేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో వైసీపీ అభ్యర్థులు కలవరపడుతున్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై ఆర్వో సీల్ లేకున్నా లెక్కించాలని ఎన్నికల సంఘం తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. దీంతో వైసీపీ కుతంత్రం పారలేదన్న చర్చలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఉద్యోగులు తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తారనీ, ఎలాగైన వారి ఓట్లు చెల్లనివిగా చేయాలని పన్నాగం పన్నారు. ఈసీ అందుకు చెక్‌పెట్టింది. ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో వైసీపీ లంచ్‌మోషన్ పిటీషన్ వేయడాన్ని బట్టి చూస్తే కుట్ర తేటతెల్లమైనట్లు స్పష్టమైంది. కౌంటింగ్ రోజు తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తారు. ఇందులో మెజార్టీ వచ్చిన పార్టీకి ఈవీఎంల కౌంటింగ్‌లో సైతం తిరుగుండదు. గత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లే ఫలితాలను శాసించాయి. ఈసారి వైసీపీ డీలా పడేలా పోస్టల్ బ్యాలెట్ ఫలితం రానుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పుడు అందరి చూపు వీటిపై పడింది.

ఓట్ల లెక్క.. ఏర్పాట్లు పక్కా..

కౌంటింగ్ దగ్గర పడుతోంది. ఈనెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద నిఘాతోపాటు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. హిందూపురం పార్లమెంటు స్థానంతోపాటు జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ చేపడుతున్నారు. రాప్తాడు అసెంబ్లీ స్థానానికి సంబంధించి అనంతపురంలో చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు హాల్‌లో ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, వారి తరఫు ఏజెంట్లకు టేబుళ్ల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కూటమి, వైసీపీ అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లతో సమీక్షలు మొదలుపెట్టారు. కౌంటింగ్ కేంద్రంలో వ్యవహరించాల్సిన తీరుపై వారికి శిక్షణ ఇస్తున్నారు. వైసీపీలో ఓటమి భయం పట్టుకున్న నేపథ్యంలో కూటమి అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లపై దూకుడుగా వ్యవహరించాలని తమ ఏజెంట్లకు నూరిపోస్తున్నారు. ఓట్ల లెక్కింపు వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లతో తమ ఆటలు సాగవని వైసీపీలో ఆందోళన నెలకొంది.

జై హనుమాన్..

నేడు హనుమజ్జయంతి
ముస్తాబైన ఆలయాలు

హిందూపురం అర్బన్, మే 31: హనుమజ్జయంతి వేడుకలకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారమే ఆలయాల వద్ద తోరణాలు, వివిధ రకాల పూలతో అలంకరణలు, భక్తుల సౌకర్యార్థం షేమియానాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలిరానుండడంతో ఆంజనేయుడి ఆలయాలు కిటకిటలాడనున్నాయి. హిందూపురంలోని ప్రసిద్ధ సూగూరు ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం 10 గంటలకు ఐదుసార్లు హనుమాన్ చాలీసా పఠనం, స్వామి నామసంకీర్తన, 11 గంటలకు మహానైవేద్యం, మహామంగళహారతి, 108 కొబ్బరి కాయలతో నివేదన, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు హిందూ సురక్షా సేవాసమితి నాయకులు తెలిపారు.



హిందూపురం దండురోడ్డులోని హనుమంతుడి భారీ విగ్రహం

అలరించిన నిత్య ఆరాధన



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, మే 31: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో బాలవికాస్ విద్యార్థులు నిత్య ఆరాధన పేరుతో శుక్రవారం ప్రదర్శించిన నృత్యం భక్తులను అలరింపజేసింది. గంటపాటు భక్తితన్మయత్వం పంచింది. తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన భక్తుల సాంస్కృతిక ప్రదర్శనలు రెండో రోజూ కొనసాగాయి. ప్రముఖ సంగీత గాయకుడు మాస్టర్ సూర్యనారాయణ బృందం గానంతో భక్తులను అలరింపజేసింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

కొనసాగిన విత్తన పంపిణీ

పుట్టపర్తి రూరల్, మే 31: జిల్లావ్యాప్తంగా ఆర్బీకేల్లో ఆరోరోజు శుక్రవారమూ సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటిదాకా హిందూపురం పరిధిలో 1469 మంది రైతులకు 1065.10 క్వింటాళ్లు, మడకశిరలో 799 మందికి 696.80, పెనుకొండలో 949 మందికి 940.30, కదిరిలో 3512 మందికి 2751.30, ధర్మవరంలో 1453 మందికి 1312.30 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు జిల్లావ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. మొత్తంగా జిల్లాలో 8182 మంది రైతులకు 6765.80 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్

పుట్టపర్తి, మే 31: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం దుకాణాలు తెరవకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

పైసా ఇవ్వకుండా ఖర్చులు చెప్పాలంట..!

- పాఠశాలల నిర్వహణకు రూపాయి విదల్చని సర్కారు
- ఏడాదంతా విద్యార్థులకు ప్రత్యక్ష నరకం
- సొంత డబ్బు వెచ్చించిన టీచర్లు
- స్కూళ్లలో ఖర్చుల ఆడిట్‌కు నిర్ణయం
- నేడు పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాలకు..
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల విస్మయం

కదిరి



ఇళ్లలో సాధారణంగా డబ్బులిస్తే ఖర్చులు లెక్కలు అడుగుతారు. ప్రభుత్వ శాఖల్లో కూడా అంతే. నిధులు విడుదల చేసి, దేనికి ఎంత వెచ్చించారో లెక్కలు అడుగుతారు. సక్రమంగా ఖర్చు చేశారా, దుర్వినియోగం చేశారా అన్న విషయాలను తేల్చుతారు. దానినే ఆడిట్ అంటారు. నిధులిస్తేనే ఆడిట్‌కు అవకాశం ఉంటుందన్నది సుస్పష్టం. విద్యాశాఖలో మాత్రం వింత పరిస్థితి నెలకొంది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని చాలా పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం రూపాయి కూడా నిధులివ్వలేదు. మరుగుదొడ్ల నిర్వహణ, చాక్‌పీస్‌లు, చార్టులకు కూడా పైసా విదల్చలేదు. ఉపాధ్యాయులే సొంత డబ్బు వెచ్చించారు. ఆ నిధులు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి. ఈ నేపథ్యంలో రూపాయి కూడా ఇవ్వకుండా ఖర్చుల లెక్కలు చెప్పాలంటూ ప్రభుత్వం ఆడిట్‌కు సిద్ధమవడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు ఆశ్చర్యం, విస్మయానికి లోనవుతున్నాయి. ఎంత ఇచ్చారని లెక్కలు చెప్పాలని మండిపడుతున్నారు. పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలల ఖర్చులపై శనివారం కదిరిలో ఆడిట్ నిర్వహించనున్నారు.



పాఠశాలల నిర్వహణకు నిధులు అవసరం. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేసేవి. వాటిలో పాఠశాలలకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్, చిన్నపాటి మరమ్మతులు, జాతీయ పండుగలు తదితరాలకు ఖర్చు పెట్టేవారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు రూపాయి కూడా నిధులివ్వలేదు. వాటికి ఆడిట్ చేయాలని నిర్ణయించడం శోచనీయం. పాఠశాలలకే కాదు, ఎంఈఓ కార్యాలయాలు, స్కూల్ కాంప్లెక్సులకు కూడా రూపాయి విడుదల చేయలేదు. 2023-24 విద్యాసంవత్సరం నిధులు లేకుండానే గడిచిపోయింది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఏడాదంతా ఇబ్బందులు పడ్డారు.

కనీస సౌకర్యాలు కరువు

పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ అతి ముఖ్యం. విద్యార్థులకు అవసరమైన చాక్‌పీసులు, చార్టులతోపాటు జాతీయ పండుగలు నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంతోపాటు రెండుగంటలకోసారి నీరు తాగాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఏడాదికి తాగునీటి కోసం పాఠశాలకు రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చవుతోంది. మరుగుదొడ్ల నిర్వహణకు డబ్బు అవసరం. మైనర్ మరమ్మతులు వస్తే వాటిని చేయించడానికి కూడా నిధుల్లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని సందర్భాల్లో విద్యార్థులే తాగునీరు ఇళ్లనుంచి తెచ్చుకోవాల్సి వచ్చింది. తాగునీరు అందుబాటులో లేక, మరుగుదొడ్ల నిర్వహణ సరిగాలేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలో మరుగుదొడ్ల పరిశుభ్రతకు అవసరమైన ఫినాల్ ఇతర రసాయన పదార్థాలతోపాటు నీటి నిర్వహణకు కూడా ఉపాధ్యాయులు ఖర్చు చేశారు. చాక్‌పీసులు, చార్టులు కూడా వారే కొనాల్సి వచ్చింది. జాతీయ పండుగలైన ఆగస్టు 15, జనవరి 26, జాతీయ నేతల జయంతుల నిర్వహణకు అదనంగా డబ్బు వెచ్చించారు. అసలే డీఏలు, పీఆర్సీ బకాయిలు అందక ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులపై ఇది మరింత భారం పెంచింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

పాఠశాలల నిర్వహణపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఏటా రూ.పదివేలనుంచి రూ.లక్ష వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలకు నిధులు విడుదలయ్యేవి. 2023-24 విద్యా సంవత్సరానికి పాఠశాలలకు నాడు-నేడు పనులకు తప్ప.. ఇతర అవసరాలకు రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. ప్రభుత్వ విధానాలు.. పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

నేడు ఆడిట్

కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలలకు శనివారం ఆడిట్ నిర్వహించనున్నారు. రూపాయి కూడా నిధులివ్వకుండా ఆడిట్ నిర్వహించడంపై ఉపాధ్యాయులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిధులే లేనపుడు ఖర్చులు ఉండవనీ, దానికి ఆడిట్ అవసరమా అని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులు జేబు నుంచి ఖర్చు పెట్టిన డబ్బును బిల్లుల కింద ఆమోదిస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంఈఓ కార్యాలయాలకూ మొండిచేయి



ఎంఈఓ కార్యాలయాలు, స్కూల్ కాంప్లెక్సులకు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఎంఈఓ కార్యాలయంలో ముఖ్యంగా నెట్‌చార్జీలతోపాటు, విద్యుత్ బిల్లులు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర ఖర్చులుంటాయి. వాటికి కూడా నిధులివ్వలేదని తెలిసింది. పైగా ప్రభుత్వం ఎమ్మార్సీలను ఎంఈఓ కార్యాలయాలుగా ఏర్పాటు చేసింది. ఒక్కో మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించడంతో మరింత భారం పడుతోంది. స్కూల్ కాంప్లెక్సుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ సమయంలో టీ, కాఫీలు, చార్టులు, మార్కర్లు తదితర సామగ్రి అవసరమవుతాయి. వాటికి కూడా ప్రభుత్వం నిధులివ్వలేదు. ఆ భారం స్కూల్ కాంప్లెక్సు చైర్మన్లపై పడింది.

ఆడిట్ తప్పనిసరి

అన్ని పాఠశాలలకు ఏటా నిధుల విడుదల, ఖర్చులపై ఆడిట్ చేయడం తప్పనిసరి. అందులో భాగంగానే ఈసారి కూడా చేస్తున్నారు. నిధులు విడుదలైన పాఠశాలలకు మాత్రమే ఆడిట్ నిర్వహిస్తారు. నిధులురాని వాటికి ఖర్చులు కూడా ఏమీ ఉండవు. ఇది ఏటా జరిగేదే.

-మీనాక్షి, జిల్లా విద్యాశాఖాధికారి

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తచెరువు, మే 31: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు సోషల్ పరీక్షకు 1100 మంది గైర్హాజరయ్యారని జిల్లా పరీక్షల నిర్వాహణాధికారి లాజర్ ప్రకటనలో తెలిపారు. సోషల్ పరీక్ష 2045 మందికిగాను 945 మంది రాయగా.. 1100 మంది గైర్హాజరయ్యారన్నారు. 46 శాతం హాజరు నమోదైందని ఆయన వెల్లడించారు.

బాబోయ్.. ఎండలు..

జూన్ ప్రారంభమైనా ప్రతాపం చూపుతున్న భానుడు
ఇళ్లలో ఉక్కపోత.. బయట ఎండ మోత... జనం విలవిల..

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	38.0 27.0	38.0 27.0	39.0 27.0	36.0 25.0	37.0 26.0



ఉదయం 10 గంటలకే మండిపోతున్న ఎండలతో నిర్మానుష్యంగా మారిన రహదారి

చిలమత్తూరు, మే 31: సాధారణంగా జూన్ నెల ప్రారంభమవగానే వేసవి ఎండలు తగ్గి, చల్లదనం సంతరించుకుంటుంది. ఈ ఏడాది మాత్రం జూన్ ప్రారంభమైనా వేసవి ఎండలు చల్లారలేదు. ఉదయం 10 గంటలకే ఎండలు భగభగమంటున్నాయి. ఇళ్లలో ఉందామంటే ఉక్కపోత.. బయటికెళ్తే ఎండల మోత. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రోహిణి కార్తె వేళ భానుడు నిప్పులను కురిపిస్తున్నాడు. దీంతో బయటకు అడుగుపెట్టాలంటే జనం జంకుతున్నారు. ఎండ వేడిమితోపాటు వడగాలుల తీవ్రత, ఉక్కపోతకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారం రోజులుగా జిల్లాలో జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. మూగజీవాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేని సంకరజాతి పాడి ఆవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గొర్రెలు, మేకలు మేతకోసం బయలుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మే చివరివారంలో అక్కడక్కడ వర్షాలు కురవడంతో కొంత ఉపశమనం కలిగిందనే చెప్పవచ్చు. వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇళ్లలో ఉష్ణతాపాన్ని తగ్గించుకోవడానికి ఫ్యాన్లు, ఏసీలు పెట్టుకున్నా అవి అంతగా ఫలితాలు ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. బయట చెట్ల కింద కూడా గాలి రావడం లేదనీ, దీంతో ఉక్కపోతకు తట్టుకోలేక దిక్కుతెలియని పరిస్థితుల్లో ఉన్నామని ప్రజలు వాపోతున్నారు.

కర్ణాటకకు సరిహద్దుగా ఉన్నా..

బెంగళూరు నగర వాతావరణాన్ని ఏ ప్రాంత ప్రజలైనా ఎంతగానో ఇష్టపడతారు. అదే పరిస్థితి కర్ణాటక సరిహద్దుగా ఉన్న చిలమత్తూరు మండలంలో కూడా కొంతవరకు ఉండేది. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఉష్ణోగ్రతలను పోల్చుకుంటే చిలమత్తూరు మండలంలో కొంత తేడాగానే ఉంటాయి. ఇక్కడి వాతావరణం కాస్త చల్లగా ఉండడంతోపాటు బెంగళూరు వాతావరణాన్ని పోలి ఉంటుందనేది ఈ ప్రాంతవాసుల నమ్మకం. ఇప్పుడు ఆ పరిస్థితి మండలంలో కనిపించడం లేదు. అనంతపురం నగరంతో సమానంగా ఇక్కడ కూడా ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటున్నాయి. చల్లని వాతావరణానికి అలవాటుపడిన ఈ ప్రాంత వాసులు పెరిగిన ఉష్ణోగ్రతలకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

నైరుతితో ఉపశమనం దక్కేనా..?

నైరుతి రుతుపవనాలపై ప్రజలు గంపెడాశతో ఉన్నారు. ఇప్పటికే రుతుపవనాలు కేరళను తాకాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. అవి నేరుగా రాష్ట్రంలోకి ప్రవేశించి, ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే తప్ప.. ఈ వేడితగ్గేటట్టు లేదు. అలా కాకుండా గతేడాదిలాగా రుతుపవనాల మార్గంలో స్వల్ప మార్పులు జరిగినా మళ్లీ కరువు పరిస్థితులు ఏర్పడతాయని పలువురు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా త్వరగా రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసి, వాతావరణం చల్లబడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇల్లు..సొల్లు..!

- కాలనీలు కాదు.. ఊళ్లకు ఊళ్లు అన్నారు..
- సీఎం జగన్‌వి అన్నీ ఉత్త మాటలే
- ఇళ్ల లబ్ధిదారుల ఆగ్రహం
- బిల్లుల జాప్యంతో పడకేసిన నిర్మాణాలు


ఆలమూరు జగనన్న లేఅవుట్‌లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం



అనంతపురం, సిటీ, మే31: జగనన్న కాలనీ పేరుతో ఇళ్లు కాదు..ఊళ్లు నిర్మిస్తాం..ప్రతి పేదవారి సొంతింటి కల నెరవేరుస్తాం..అన్న సీఎం జగన్ మాటలు ఉత్తిత్తివే అని తేలిపోయాయి. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో అటు వైసీపీ ప్రభుత్వం..ఇటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు పడకేశాయి. మొండి గోడలు, అరకొర నిర్మాణాలతో కాలనీలు బోసిగా దర్శనమిస్తున్నాయి. ఐదేళ్లుగా అరకొరగా సాగిన నిర్మాణాలు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో మరింత దయనీయంగా మారాయి. పైగా ప్రభుత్వం ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి సకాలంలో సరఫరా చేయకపోవడం.. బిల్లుల జాప్యంతో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం పెనుభారంగా మారింది. సొంతింటి నిర్మాణంపై కోటి ఆశలు పెట్టుకున్న తాము నేడు నిలువ నీడ లేకుండా పోయామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దెలు కట్టలేక అప్పులపాలయ్యామంటున్నారు. ఏది ఏమైనా జిల్లావ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిస్థితి దయనీయంగా మారింది.

జిల్లాలో జగనన్న కాలనీల పరిస్థితి ఇదీ..	
	- మంజూరైన ఇళ్ల సంఖ్య : 72,457
	- పూర్తయిన ఇళ్ల సంఖ్య : 28,021
	- నిర్మాణానికి నోచుకోని ఇళ్ల సంఖ్య : 8,161
	- నిర్మాణంలో ఉన్న ఉన్న ఇళ్ల సంఖ్య : 36,275
	- పెండింగ్ బిల్లులు.. సుమారు రూ.50 కోట్లు

లబ్ధిదారులకు తప్పని అవస్థలు

జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇసుక, సిమెంట్ సరైన సమయానికి సరఫరా చేయకపోవడం, బిల్లులు సకాలంలో ఇవ్వక పోవడంతో లబ్ధిదారులు అప్పులపాలు కావాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకం తీరు జిల్లా వ్యాప్తంగా అభాసుపాలయ్యిందనే విమర్శలు లేకపోలేదు. ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో బాధిత లబ్ధిదారులకు సొంతింటి కల మరింత జాప్యమైంది. సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి నెలకొంది.

ఇసుక, సిమెంట్ సరఫరా అంతంతే

జిల్లాలో ప్రధానంగా అనంతపురం, రాప్తాడు, తాడిపత్రి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణ పరిస్థితి దయనీయంగా మారింది. వీటికితోడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రూ. 1.80లక్షలు ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోకపోయినా.. సొంతింటి కల కోసం చాలా మంది లబ్ధిదారులు నానా అవస్థలు పడి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వం లబ్ధిదారులు ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం ఇసుక, సిమెంట్ సరఫరా చేయాల్సి ఉంది. ప్రభుత్వం అరకొరగా అందించడంతో అవి సరిపోక నిర్మాణాలు ఆగిపోయాయి. కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి మరీ ఇళ్లు కట్టించుకున్నామని వాపోతున్నారు.

బిల్లుల మంజూరులో జాప్యం

జగనన్న కాలనీల్లో అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లకు సైతం బిల్లులు సకాలంలో రాకపోవడంతో లబ్ధిదారులకు మరింత ఆవేదన తప్పడం లేదు. బిల్లుల జాప్యంతోనే చాలా మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి జంకుతున్నారు. ఇప్పటికే జిల్లాలో రూ. 50 కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఏదీ ఏమైనా జగనన్న ఇళ్ల పరంగా సీఎం జగన్ చెప్పిన మాటలకు.. జిల్లాలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేకుండా పోయింది. ఇళ్లు కాదు కాలనీల పేరుతో ఊళ్లకు ఊళ్లు నిర్మించి ఇస్తామని మాట ఇచ్చిన జగన్ తమను అప్పుల పాలు చేశారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో జగనన్న కాలనీలు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైందన్న విషయం స్పష్టంగా అర్థమవుతోంది.



కొంత మేర ఇళ్ల నిర్మాణం తగ్గింది..

- నరసింహారెడ్డి, ఇన్‌చార్జి పీడీ జిల్లా గృహ నిర్మాణశాఖ



ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కొంత వరకు ఇళ్ల నిర్మాణాలు తగ్గిన విషయం వాస్తవమే. అయితే ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని చూస్తున్నాం. పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వానికి ఇదివరకే నివేదించాం. సిమెంట్, ఇసుక తదితర సామగ్రి సకాలంలో సరఫరా అయ్యే విధంగా చూస్తాం. లబ్ధిదారులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కరెంటు కష్టాలు తీరేదెన్నడో..?

- పాలకుల పాపం.. ప్రజలకు శాపం..
- చిన్న పాటి గాలివానకే ఆగిపోతున్న విద్యుత్ సరఫరా
- నాలుగు రోజులు అల్లాడిన 20 గ్రామాల ప్రజలు
- రూ.2 కోట్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- టీడీపీ హయాంలో ప్రతిపాదనలు
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు


నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం

విడపనకల్లు, మే 31: చిన్నపాటి గాలీవాన వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. స్తంభాలు కూలిపోవడంతో సరఫరాను ఆపివేస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం వైసీపీ పాలకులు కూడా ఇటువైపు చూడలేదు. విద్యుత్ లేక ఆయా గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవటం సహజమే. ప్రస్తుతం ఎంతో టెక్నాలజీని అందిపుచ్చుకున్న ఈ కాలంలో కూడా విద్యుత్ సరఫరా ఆగిపోతే నాలుగు రోజులపాటు 20 గ్రామాల ప్రజలు నరకం చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఐదు సంవత్సరాలు కాలంలో ప్రతీ ఏటా ఈదురు గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోయి సరఫరా నిలిచిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే వారం రోజుల క్రితం కురిసిన గాలీవానకు విడపనకల్లు, వీ కొత్తకోట, మాళాపురం, వేల్పుమడుగు, పెద్ద కొట్టాలపల్లి, జనార్థనపల్లి, ఆర్ కొట్టాల, డోనేకల్లు, కడదరబెంచి, గడేకల్లు, అంచనహాలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో ప్రజలు కరెంటు లేక చీకట్లో మగ్గాల్సి వస్తోంది. గుంతకల్లు నుంచి విడపనకల్లు మండలానికి 33/11 కేవీ విద్యుత్ సరఫరా అవుతోంది. గుంతకల్లు నుంచి 35 కి.మీ పొడవునా విద్యుత్ స్తంభాలు ఎక్కడ కూలిపోయాయో గుర్తించడానికే ఒక రోజు సమయం పడుతుంది. కూలిన విద్యుత్ స్తంభాలను గుర్తించి అధికారులు వారం పది రోజులు శ్రమించి విద్యుత్‌ను సరఫరా చేయిస్తున్నారు. ఈ పరిస్థితి లేకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం విడపనకల్లు మండలానికి డబుల్ ఫీడర్ లైన్ ఉండాలని ప్రత్యామ్నాయంగా కేవలం గంట వ్యవధిలోనే విద్యుత్ సరఫరా అందించేందుకు ఉరవకొండ నుంచి 33/11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు రూ.2 కోట్లకు పైగా ప్రతిపాదనలు పంపింది. అయితే ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి అధికారులు గాని, వైసీపీ నాయకులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మండలంలోని 20 గ్రామాల ప్రజలకు గాలీవాన వస్తే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు, అధికార పార్టీ నాయకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ఎన్ని రోజులైనా గ్రామాలు అంధకారంలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. గుంతకల్లు లైన్‌లో సమస్యలు వస్తే వెంటనే ఉరవకొండ లైన్ ద్వారా విద్యుత్‌ను ప్రత్యామ్నాయంగా ఇవ్వాలనే ఆలోచన ఎవరికీ లేక పోవటం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కానీ అధికార పార్టీ నాయకులుకు మేలు జరిగేలా గడేకల్లులో రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మాత్రం భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాటు చేయలేదుకాని వారి అనుచరుల జేబులు నింపే పనులు మాత్రం చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

నాలుగు రోజులు చీకట్లో ఉన్నాం



చిన్న గాలీవానకు గంతకల్లు వద్ద కరెంటు స్తంభాలు పడిపోయాయని నాలుగు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బస్టాండ్ వద్ద టీకొట్టు పెట్టుకున్నాను. కరెంటు లేక వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. అధికారులు గాని, వైసీపీ నాయకులు గాని పట్టించుకోలేదు. ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఇవ్వాలని ఎవరూ ఆలోచించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- అంజి, విడపనకల్లు

టీడీపీ హయాంలో ప్రతిపాదనలు



ప్రతి సంవత్సరం గాలీవానకు గుంతకల్లు వద్ద విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయి. వాటిని రిపేరి చేసేందుకు వారం రోజుల సమయం పడుతోంది. కరెంటు పోయిన గంటకో రెండు గంటలకో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సిన అధికారులు వారం రోజులైనా పట్టించుకోవడం లేదు. నాలుగు రోజులు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. తక్షణం అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించాలి. **- మోహన్, విడపనకల్లు**

విద్యుత్ లేక తాగునీరు రావడం లేదు



నాలుగు రోజులు విద్యుత్ లేకపోవటంతో తాగేందుకు నీరు కూడా లేవు. రాత్రి సమయాల్లో విషపురుగుల భయంతో అల్లాడిపోతున్నాం. ఎండవేడిమికి ఎక్కడి నుంచి ఏ విషపురుగు వస్తుందో అని భయంగా గడుపుతున్నాం. ఉరవకొండ, పాల్తూరు సబ్ స్టేషన్ల నుంచి గంట, రెండు గంటల్లో విద్యుత్ ఇవ్వాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదెక్కడి ప్రభుత్వమో అర్థం కావటంలేదు. **-బసన్న, విడపనకల్లు**

పట్టించుకునే వారే లేరు..



టీడీపీ ప్రభుత్వంలో ఉరవకొండ నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్ లైన్లు ఏర్పాటకు ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ప్రతిపాదనను తుంగలో తొక్కి మండలానికి విద్యుత్ సరఫరా లేకుండా చేశారు. వారం పది రోజులు కరెంటు పోతే కూడా వైసీపీ నాయకులు ఒక్కరూ పట్టించుకోలేదు. నాలుగు రోజులు 20 గ్రామాల ప్రజలు చీకట్లోనే ఉండాల్సి వచ్చింది. మాకు ఈ దరిద్రం ఎప్పుడు పోతుందో ఏమో.

- ఎర్రిస్వామి, విడపనకల్లు

జీబీసీ, హంద్రీనీవా ఈఈల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: హంద్రీనీవా సుజల స్రవంతి పథకం గుంతకల్లు డివిజన్ ఈఈగా శ్రీనివాసనాయక్, హెచ్చెల్సీ పరిధిలోని గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) ఈఈగా వెంకటరమణలను నియమిస్తూ జలవనరుల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హంద్రీనీవా గుంతకల్లు ఈఈ రామకృష్ణ యాదవ్, హెచ్చెల్సీ జీబీసీ ఈఈ మోహన్‌మూర్తి శుక్రవారం పదవీవిరమణ పొందారు. దీంతో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ గుంతకల్లు ఈఈగా అదే డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసనాయక్‌కు, చెన్నేకొత్తపల్లి డీఈగా పనిచేస్తున్న వెంకటరమణలకు హెచ్చెల్సీ జీబీసీ ఈఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయా స్థానాల్లో ఇద్దరు ఈఈలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: నిరుద్యోగ యువతీ, యువకులకు 'ఉన్నతి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. 35రోజుల పాటు బెంగుళూరులో శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15 వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. జూన్ 6వతేదీ నుంచి ప్రారంభించే శిక్షణకు, పేర్ల నమోదు మరిన్ని వివరాలకు సెల్ నంబరు 90004 87423ను సంప్రదించాలని కోరారు.

సహకార శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మే 31: కోఆపరేటివ్ డిప్లమా మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్ 9వ బ్యాచ్ 24వారాల సహకార శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సహకార సంస్థలు, సహకార సొసైటీల్లో పనిచేస్తున్న సిబ్బంది సహకార శిక్షణ తప్పనిసరిగా పూర్తి చేసి ఉండాలని నిర్దేశించినందున సహకార చట్ట పరిధిలో రిజిస్టర్ అయిన సహకార సొసైటీల పాలకవర్గాలు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సహకార సొసైటీలు, సహకార బ్యాంకులు, సహకార సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి పదోతరగతి ఉత్తీర్ణత, ఇతరులు ఇంటర్, సమాన అర్హత గల వారు డిప్లమా కోర్సుకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా రామ్‌నగర్‌లోని రాయలసీమ శిక్షణ కేంద్రంలో స్వయంగా దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9490741137 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ట్విస్టు మీద ట్విస్టు..!

- సమగ్రశిక్ష ఏపీసీ పోస్టు మాకొద్దంటే.. మాకొద్దు..
- జడ్పీ సీఈఓ నిదియాదేవికి అప్పగిస్తూ ఉత్తర్వులు
- విద్యాశాఖకు తొలిసారి ఐఏఎస్ అధికారి


నిదియాదేవి

అనంతపురం విద్య, మే 31: ఏదైనా ఉన్నతాధికారి సీటు ఖాళీ అయిందంటే.. ఆ స్థానం కోసం అధికారులు పోటీ పడడం సహజం. అనంతపురం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పోస్టంటేనే అధికారులు బెంబేలెత్తుతున్నారు. 'మాకొద్దు బాబోయ్' అంటూ విద్యాశాఖ అధికారులు చేతులెత్తేయడంతో మళ్లీ రెవెన్యూశాఖ చేతుల్లోకి వెళ్లింది. రెవెన్యూశాఖ నుంచి వచ్చిన వరప్రసాద్ ఏపీసీగా పని చేశారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. మొదట ఏపీసీగా డీఈఓ వరలక్ష్మీ, తర్వాత ఏడీ నాగరాజు పేర్లు వినిపించినా... అనూహ్యంగా... జడ్పీ సీఈఓ పేరు ఖరారయ్యింది. శుక్రవారం జడ్పీ సీఈఓ నిదియా దేవి సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకం వెనక అనూహ్య మలుపులు తిరిగినట్లు సమాచారం. విద్యాశాఖ కీలక పదవి మళ్లీ రెవెన్యూ శాఖకే చేరడం చర్చనీయాంశమయ్యింది.

మొదట ఏడీ, తర్వాత డీఈఓనా...?

ఏపీసీగా వరప్రసాద్ రిటైర్డ్ కావడానికి ముందే జిల్లా విద్యాశాఖలో ఏడీగా పనిచేస్తున్న నాగరాజుకు ఏపీసీ బాధ్యతలు అప్పజెప్పాలని జిల్లా విద్యాశాఖాధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇదే విషయం కలెక్టర్‌కు కూడా వివరించి, ఉత్తర్వులు కూడా తయారు చేయించినట్లు తెలుస్తోంది. ఉన్నఫళంగా జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మిని ఏపీసీగా నియమిస్తూ.. సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఏపీసీగా పనిచేయడానికి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, పనిఒత్తిడి ఇతర కారణాల వల్ల డీఈఓ అయిష్టత చూపినట్లు సమాచారం. దీంతో ఏడీగా పనిచేస్తున్న నాగరాజుకే ఏపీసీ బాధ్యతలు అప్పజెప్పాలని జిల్లా విద్యాశాఖలో విశ్వప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. ఈ విషయంలో అధికారులు సఫలం కూడా అయ్యారు. ఇంతలో డీఈఓకు ఏపీసీగా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు రావడంతో... ఎలాగైనా ఏడీనే ఏపీసీగా కొనసాగించేలా..... ఎస్పీడీకి ర్యాటిఫికేషన్ కూడా రాసేలా జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఎపిసోడ్‌లో అటు డీఈఓ, ఇటు ఏడీ ఇద్దరూ సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీగా పనిచేయడానికి ఇష్టంగా లేరని గ్రహించిన కలెక్టర్ అనూహ్యంగా జడ్పీ సీఈఓ నిదియాదేవిని తెరపైకి తెచ్చినట్లు సమాచారం. అందులో భాగంగానే నిదియాదేవికి ఏపీసీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ...కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం వరప్రసాద్ బాధ్యతలు అప్పగించగా, నిదియాదేవి సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు.

తొలిసారి ఐఏఎస్...

సమగ్రశిక్షకు తొలిసారి ఐఏఎస్ అధికారిని ఏపీసీగా నియమించారు. గతంలో పీఓగా ఉన్న ఈపోస్టును ఏపీసీగా మార్చారు. అయితే సమగ్రశిక్ష పీఓగా లేదా ఏపీసీగా ఇంత వరకూ ఎవరూ ఐఏఎస్ అధికారులు రాలేదు. డీఈఓలు, ఏడీలు, ఇతర శాఖల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, ఆర్డీఓలు మాత్రమే పనిచేశారు. కీలకమైన విద్యాశాఖ పోస్టు రెవెన్యూ శాఖకు చేరడం విశేషం.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం టౌన్, మే31: నగరంలోని జేఎన్‌టీయూలో 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. అనంతపురం పార్లమెంట్ సహా, ఎనిమిది నియోజకవర్గాల ఓట్లను ఇక్కడే లెక్కించనున్నారు. దీంతో పటిష్ఠ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ మొదలయ్యేది ఇలా..

కౌంటింగ్ ప్రక్రియ పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభమవుతుంది. అరగంట తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. పోలింగ్ స్టేషన్‌వారీగా ఈవీఎంలను టేబుల్స్ వద్దకు తీసుకొచ్చి ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు ప్రారంభిస్తారు. ప్రతి ఈవీఎంలో రౌండ్ల వారీగా ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయని ఆర్‌ఓలు అధికారికంగా ప్రకటిస్తారు. ప్రతి అసెంబ్లీకి 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారు. ఉరవకొండ నియోజకవర్గానికి 18 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు.

ఏజెంట్లకు నిబంధనలివే..

- కౌంటింగ్ ఏజెంట్‌గా నియమితులైనవారు జూన్4వతేదీన ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి.
- ఫారం18డిక్లరేషన్, డ్యూటీ ఆర్డర్, జారీచేసిన ఐడీ, ఆధార్‌కార్డు, ఒకఫొటో, ఒకనోట్‌బుక్, పెన్, ఫారం-17సీ తీసుకొని హాజరు కావాలి
- సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లిన తర్వాత బయటకు రావడానికి అనుమతించరు. కేటాయించిన టేబుల్ వద్దే కూర్చోవాలి.
- కౌంటింగ్ సిబ్బంది ఫెన్సింగ్ లోపల ఉంటారు. ఏజెంట్లు వెలుపల కూర్చోవాలి. లోపలికి అనుమతించరు.
- పార్లమెంటు, అసెంబ్లీకి వేరువేరు టేబుల్స్ ఉంటాయి, ఎం అని నోట్ చేసి ఉంటే మీకు వచ్చిన సీయూలో మాక్‌పోల్ డిఫెక్ట్ ఉన్నట్లు, డీ, అని నోట్‌చేసి ఉంటే మీరు రిజల్ట్ చెక్ చేయాలన్నట్లు తెలుసుకోవాలి.
- పొరపాటున పీఓలు ఈవీఎంలకు క్లోజింగ్ బటన్ నొక్కి ఉండకపోతే వాటిని క్లోజ్ చేసిన తర్వాత ఫలితాలు చూసుకోవాలి.
- ఒక్కో టేబుల్ వద్ద సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. వీరితో పాటు నియోజకవర్గ ఆర్‌ఓ, ఏఆర్‌ఓకూడా అక్కడే ఉంటారు.

ముగిసిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం విద్య, మే 31 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు సోషల్ పరీక్ష నిర్వహించారు. 45 కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో 4,774 మందికిగాను 2,696 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా.. 2078 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారి కంటే గైర్హాజరైన వారే అధికంగా ఉండడం గమనార్హం. శనివారం నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. 7 కేంద్రాల్లో 1391 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

సరిహద్దుల్లో కొనసాగుతున్న సర్వే

రాయదుర్గం, మే 31: ఏపీ, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఇనుప గనుల వద్ద శుక్రవారం రెండో రోజు సర్వే కొనసాగింది. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం సిద్ధాపురం, మలపనగుడి గ్రామాల సమీపంలో ఉన్న కొండల్లో కేంద్ర బృందం సర్వే నిర్వహించింది. కర్ణాటకలోని ఏడు గనుల లీజు గడువు పూర్తి కావడంతో రెన్యువల్ చేయడం కోసం ఈ సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం ఉండటంతో ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించేందుకు అధికారులు రెండురోజులుగా కసరత్తు చేస్తున్నారు. గనుల యజమానుల వద్ద ఉన్న లీజు రికార్డులు, ప్రభుత్వం వద్ద ఉన్న లీజు సరిహద్దు రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల మైనింగ్, అటవి, రెవెన్యూ శాఖల అధికారులు, భూరికార్డుల అధికారులు సర్వేలో పాల్గొంటున్నారు. విఠలాపురం, టుములటి గ్రామాల చిత్రపటాలు, ఆ గ్రామాలకు ఆనుకుని ఉన్న సిద్ధాపురం, మలపనగుడి గ్రామాల చిత్రపటాలను పరిశీలించి.. క్షేత్రస్థాయిలో కొలతలు తీస్తున్నారు. గనుల యజమానులకు లీజు సమయంలో కేటాయించిన సరిహద్దులను గుర్తించి, అనంతరం గ్రామాల సరిహద్దులను నిర్ధారిస్తున్నారు. ఇప్పటివరకు ప్రాథమికంగా గనులకు సంబంధించిన సరిహద్దులను గుర్తించినట్లు తెలిసింది. జూన్ ఆరో తేదీ వరకు పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. సర్వే ప్రక్రియలో ప్రొఫెసర్ సూరత్ హర్షవర్ధన్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ రూప్లానాయక్, కర్ణాటక సీనియర్ జియాజిలిస్టు చంద్రు, సర్వేయర్ రవితేజ పాల్గొంటున్నారు.


గనుల ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, మే 31: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 564 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



ఓటమిభయంతోనే సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు


మాట్లాడుతున్న కందికుంట

కదిరి, మే 31: ఓటమి భయంతోనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రజలను, వైసీపీ నాయకులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌటింగ్‌లో దౌర్జన్యాలు, అరాచకాలు సృష్టించడాని వైసీపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. సజ్జల చేసే వ్యాఖ్యలు చూస్తుంటే పరిస్థితి అలానే ఉందన్నారు. ఓటమిని భయంతోనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ శ్రేణులందరూ సమయనంతో ఉండాలని సూచించారు. వైసీపీ నాయకులు రెచ్చగొట్టినా, పట్టించుకోకూడదన్నారు. ఎన్నికలు ముగిశాయని, కౌటింగ్ మాత్రమే మిగిలిందన్నారు. రాష్ట్రంలో, కదిరిలో కూటమి గెలవబోతోందని ధీమావ్యక్తం చేశారు. సిద్ధాంతాలు, క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ అని ఆయన గుర్తు చేశారు.

నాసిరకం విత్తనాలతో రైతులకు నష్టం


ఆర్బీకేలో విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న సత్యకుమార్

బత్తలపల్లి, మే31: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై నాసిరకమైన విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేస్తోందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ ఆరోపించారు. మండలంలోని సంజీవపురం రైతుభరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ కాయల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు నాసిరకం విత్తనాలు ఇస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నాసిరకం విత్తనాలనే పంపిణీ చేస్తున్నారన్నారు. దీంతో పంటలు నష్టపోయి వందలాది మంది రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు చోటు చేసుకున్నాయని వాపోయారు. కూటమి అధికారంలోకి రాగానే రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. నాణ్యతగా ఉండే వేరుశనగ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటిసూర్యప్రకాష్‌బాబు, సురేంద్రనాయుడు, వీరనారప్ప, ఆదినారాయణయాదవ్, రమణ, వెంకటేష్, బొజ్జి తదితరులు పాల్గొన్నారు.

జీన్లకుంటలో పోలీసుల తనిఖీ


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణవేణి

గాండ్లపెంట, మే 31: మండలంలోని జీన్లకుంట పంచాయతీలో శుక్రవారం ఎస్‌ఐ కృష్ణవేణి సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో, ప్రాంతాలలో తనిఖీలు చేశారు. అనంతరం ఎస్‌ఐ గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజున ఎవరూ విజయోత్సవ సంబరాలు నిర్వహించరాదన్నారు. గొడవలు, ఘర్షణలకు పాల్పడకూదని సూచించారు. కార్యక్రమంలో జమేదార్ రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యగారిపల్లిలో పోలీసుల పర్యటన



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

బుక్కపట్నం, మే 31: మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో పోలీసులు పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత ఎస్‌ఐ సురేష్‌బాబు సిబ్బందితో కలిసి అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నిల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిషేధమన్నారు. గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ క్రిష్ణమూర్తి, ఏఎస్‌ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరి మహిళకు కుట్టుమిషన్ పంపిణీ

పుట్టపర్తి రూరల్, మే 31: చిన్నవయస్సులో భర్తను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఒంటరి మహిళ బోగిసునీతకు కుట్టుమిషన్ అందించి ఖిద్మత్-ఏ-ఖల్క్ ట్రస్టు వారు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని రెండోవార్డులో నివాసముంటున్న బోగిసునీత భర్త రామచంద్ర 4నెలల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆమె తన ఇద్దరు కుమార్తెలను పోషించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించి న ఖిద్మత్-ఏ-ఖల్క్ ట్రస్టు అధ్యక్షుడు షామీర్ సత్యసాయి భక్తుల సాయంతో జీవనోపాధి నిమిత్తం ఆమెకు కుట్టుమిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ


తిరుపాల్‌ను పరామర్శిస్తున్న సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మే31: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత వైసీపీ నాయకులు చేసిన దాడిలో పట్టణంలోని 27వ వార్డు టీడీపీ నాయకుడు తిరుపాల్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు శుక్రవారం తిరుపాల్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. దాడికి గల కారణాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఇంకా పలువురిని వారి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి కందికుంట పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కందికుంట వెంకట ప్రసాద్

తనకల్లు, మే 31: మండలకేంద్రంలోని ఇందిరా నగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బుచ్చినారాయణప్ప (65) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ వచ్చి మృతహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సీనియర్ నాయకులు దేశాయి ప్రభాకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, తోట సరోజమ్మ, దామోదర్, దస్తగిరి, శంకర్, సుధాకర్, ప్రసాద్, జనసేన నాయకులు అమర్‌కార్తికేయ, రమణ తదితరులు ఉన్నారు.

3 వరకు సర్వీసు ఓట్ల స్వీకరణ

ధర్మవరం, మే 31: సర్వీసు ఓటర్ల (ఆర్మీఉద్యోగులు) పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈనెల 3వ తేదీ వరకు స్వీకరించనున్నామని ఎన్నికల రిటర్నింగ్‌అధికారి వెంకట శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గానికి చెందిన 258 మంది సర్వీసు ఓటర్లు వివిధ సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నార న్నారు. వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకా శాన్ని ఎన్నికల కమిషన్ ఇచ్చిందని అన్నారు. ఇప్పటి వరకు 121 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రిజిస్టర్ పోస్టు ద్వారా ఆర్వీఓ కార్యాలయానికి అందాయన్నారు. ఆర్మీ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పోస్టల్‌బ్యాలెట్ దరఖాస్తులు మాత్రమే స్వీకరి స్తున్నామని ఆయన పేర్కొన్నారు.

నిరుపయోగంగా..

దిష్టిబొమ్మల్లా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు




ఆకుతోటపల్లి, పొడరాళ్లపల్లిలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రాలు

ముదిగుబ్బ, మే31: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం మండలంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో తడి, పొడి చెత్తను ఆయా కేంద్రాలకు తరలించి, వాటి ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం తెచ్చిపెట్టాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం మండలంలోని ఆకుతోటపల్లి, పొడరాళ్లపల్లి తదితర గ్రామాల్లో రూ. లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని గాలికొదిలేసింది. నిర్వహణ సరిగా లేకపోవడంతో వాటి చు ట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. దీంతో లక్ష్యం నెరవేరక ప్రజాధనం వృథా అయ్యిందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ముదిగుబ్బ ఈవోఆర్డీ కృష్ణకుమార్‌ను వివరణ కోరగా.. మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ వాసుదేవన్ హెచ్చరిక ● కొత్తచెరువులో పోలీసుల మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్, మే 31: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసకుంటామని డీఎస్పీ వాసుదేవన్ హెచ్చరించారు. హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటే అల్లరిమూకలపై పోలీసులు తీసుకునే చర్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే మాక్‌డ్రిల్ ముఖ్యఉద్దేశమని అన్నారు. కొత్తచెరువు మండలకేంద్రంలోని సెప్రూటాసర్కిల్‌లో శుక్రవారం సాయం త్రం పుట్టపర్తి సబ్‌డివిజన్ సివిల్ పోలీసులు, ఏఆర్ పోలీసులు కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోలీసులు చేపట్టిన మాక్‌డ్రిల్ ఆపరేషన్ విన్యాసాలు ప్రజలను అబ్బుర పరిచాయి. ఇందులో భాగంగా ప్లకార్డులు చేతపట్టి ఆందోళనలు చేసే వారిని కంట్రోల్ చేయడంలో భాగంగా మొదట హెచ్చరికలు చేయడం, ఆపైన పైఅధికారుల ఆదేశంతో భాష్పవాయివు ప్రయోగం, వాటర్‌క్యాన్ ప్రయోగం, లాఠీచార్జ్ చేపట్టడం, అప్పటికీ పరిస్థితులు అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటి విన్యాసాలను (డెమో)మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత డీఎస్పీ మాట్లాడుతూ.. విధ్వంసకారులు అల్లర్లకు పాల్పడుతున్న తరుణంలో సమయస్ఫూర్తితో వాటిని ఎలా నియంత్రించాలో ప్రజలకు తెలియజేయడమే మాక్‌డ్రిల్ ఆపరేషన్ అని వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు రాజారమేష్ ,రాగిరి రామయ్య, కొండారెడ్డి, రాజేంద్రయాదవ్, ఆర్ఐ చంద్రశేఖర్, ఎస్ఐలు సురేష్, కృష్ణమూర్తి, వంశీకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురంలో గ్రీన్ ర్యాలీ




మొక్కలు నాటుతున్న ఏపీపీసీబీ అధికారులు, ఆర్డీటీ సభ్యులు

అనంతపురం, మే 31: అనంతపురంలో శుక్రవారం గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) అనంతపురం రీజనల్ కార్యాలయం, బత్తలపల్లిలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పర్యావరణ హితంపై అవగాహన కల్పించారు. కార్యాలయం మెయిన్ గేట్ నుంచి విసెంటే ఫెర్రర్ విశ్రాంతి స్థలం వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డీటీ ఆడిటోరియంలో పర్యావరణ అవగాహన సదస్సు జరిగింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడంతోపాటు మున్సిపల్ ఘన వ్యర్థాలు, బయో మెడికల్ వ్యర్థాలను వేరుచేయడం, శాస్త్రీయంగా పారవేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమాల్లో ఏపీపీసీబీ అధికారులు, ఆర్‌డీటీ అధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఎస్‌హెచ్ శర్మ, డాక్టర్ రఘు ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ మనోరంజన్, అర్చన, ఇతర అధికారులు, పాఠశాలల, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం.. క్యాన్సర్‌కు కారకం

● పొగాకు వ్యతిరేక దినోత్సవంలో వైద్యులు



పుట్టపర్తిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి రూరల్, మే 31: పొగాకు వాడకం వలన క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధికి గురవుతారని జిల్లా ఎన్సీడీ సీడీ, ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత, డీపీఎం డాక్టర్ కేసీకే నాయక్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం డాక్టర్ నివేదిత మాట్లాడుతూ పొగాకు, తంబా కు, బీడీ, సిగరెట్ తాగడం, గుట్కా నమలడం వల్ల క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు వస్తాయన్నారు. ఈ మత్తు పదార్థాల వాడకం వల్ల నోటిక్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్‌తో పాటు క్షయ, గుండెజబ్బులు గురై అనేకమంది తమ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. తద్వారా వారి కుటుంబాలు దిక్కులేనివారు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ ప్రొవైడర్లు పొగాకుకు బానిస అయిన వారిని దత్తత తీసుకుని వారితో పొగాకు మాన్పించే చర్యలకు పూనుకోవాలన్నారు. అనంతరం వైద్యాధికారి మునిచంద్రిక మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు సైతం చిన్నవయస్సులోనే ఫ్యాషన్‌గా పొగాకు తాగడం అలవాటు చేసుకుని వాటికి బానిసలవుతున్నారన్నారు. ఇలాంటి వారిని వైద్యసిబ్బంది గుర్తించి మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాలను తెలియచేసి పొగాకు తాగడం మాన్పించాలని సూచించారు. జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ త్రిలోక్‌నాథ్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో పొగతాగితే పడే జరిమానాలు, జైలుశిక్షలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పొగాకు తాగొద్దు- క్యాన్సర్‌కు గురికావద్దు, సిగరెట్‌పొగ- జీవితానికిసెగ, పొగాకు వద్దు -జీవితమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమాలజిస్టు బాలాజీ, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పీహెచ్‌ఎన్ లలితకుమారి, సూపర్వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఓడీసీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ మాట్లాడుతూ సిగరెట్లు, బీడీలు, పొగాకు తదితరవాటిని తాగడం వల్ల పలురకాల క్యాన్సర్లు, దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. కనుక ఎవరూ పొగాకు జోలికి వెళ్లరాదని సూచించారు. తర్వాత ఈ మేరకు వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు కమల్‌రోహిత్, సిబ్బంది సుహాసినీ, దిల్‌షాద్, విజయకుమారి, మురళి, వరలక్ష్మి, సరిత, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి మందుల పంపిణీ

ముదిగుబ్బ: ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో మద్యపానం, ధూమపానం, గుట్కా, పొగాకు ఇతర వ్యసనాలు కలిగిన 50మందికి స్థానిక శ్రీసత్యసాయి భజన మందిరంలో శుక్రవారం బ్రహ్మకుమారీస్ ఆశ్రమం వారు ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేశారు. బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజున డ్రోన్ కెమెరాలతో నిఘా: సీఐ

ముదిగుబ్బ,మే31: ఓట్ల లెక్కింపును దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచినట్లు సీఐ యతీంద్ర పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు జరగనుందని, కనుక జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలు గుంపులుగా ఉండరాదని తెలిపారు. 30పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉందని సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయడం, బాణాసంచా కాల్చడం చేయరాదని సూచించారు. ఎవరు గెలిచినా విజయోత్సవ ర్యాలీలు చేయరాదని, డీజేలు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించకూడదని తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా గొడవపడితే చట్టపరమైన చర్యలు తీసుకొని జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. 3, 4, 5 తేదీల్లో మద్యం దుకాణాలు, బార్లు బంద్ చేస్తారని, కనుక గ్రామాలలో గానీ, హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లలో గానీ అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బైకులకు, ఏ ఇతర వాహనాలకైనా సైలెన్సర్లు తీసివేసి పెద్దపెద్ద శబ్దాలు చేసుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే.. వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మండలం మొత్తం డ్రోన్ కెమెరాల నిఘాలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు: సీఐ

నల్లమాడ: ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, కౌటింగ్ ముందు, తరువాతకూడా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమయమనం పాటించాలని సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ శుక్రవారం తెలిపారు. కౌటింగ్ తరువాత ఎవరైనా విజయోత్సవ ర్యాలీలు జరపడం కానీ, బాణసంచా కాల్చడం కానీ చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం


సూర్యుడు దంపతులను సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

ధర్మవరం రూరల్, మే31: ఆర్టీసీ డ్రైవర్ వీ. సూర్యుడు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనకు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం అధికారులు, తోటి ఉద్యోగులు, బంధువులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాల తో సూరీడు, ఆయన సతీమణి అరుణమ్మను ఘనంగా సత్కరించారు. డిపోమేనేజర్ సత్యనారాయణరావు , యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు 'సాధన' విద్యార్థులు


ఎంపికైన సాధన పాఠశాల విద్యార్థినులు

కదిరిఅర్బన్, మే 31: అంతర్‌జిల్లా మహిళా విభాగం క్రికెట్ పోటీలకు పట్టణంలోని సాధన పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ సాధిక్ బాషా శుక్రవారం తెలిపారు. ఆంధ్రక్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి 6వ తేదీవరకు నెల్లూరులో జరిగే అంతర్ జిల్లాల అండర్ -15 క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. పి నిత్యారెడ్డి, కేఎస్ హుస్నారా, బి. తేజశ్వని ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నాడు, నేడు పనులపై సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

ఓబుళదేవరచెరువు, మే 31: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం సర్వశిక్ష అభియాన్ అలెస్కో, (అల్టినేటివ్ స్కూల్ కోఆర్డినేటర్) ఆనంద్‌బాబు నాడు, నేడు పనులపై సమీక్షించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో నాడు, నేడు పనుల పురోగతిని, నిధుల వాడకం, తదితరవాటిపై సీఆర్పీలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు దివ్యాంగుల పిల్లల గుర్తింపుసర్వేలో పాల్గొన్నారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడానికి సీఆర్పీలు తమవంతు కృషి చేయాలన్నారు. సీఆర్పీలు చెన్నకేశవ, నరసింహులు, అన్సర్‌వలీ, వెంకటేష్, జనార్దన్, కేశవ, జయమ్మ, రిజ్వానా పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

● ముస్తాబవుతున్న ఆలయాలు


చెలిమి ఆంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్

ధర్మవరంరూరల్, మే31: హనుమాన్ జయంతి వేడుకలు శనివారం జరగనుండడంతో పట్టణ, మండలవ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నిర్వాహకులు ఆలయాలను తోరణాలు, వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ప్రాచీనమైన ఆలయంగా పేరుగావించిన చెలిమి ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భారీఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్న ట్లు ఆలయకమిటీ తెలిపారు. ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనం కలిగిస్తామని చెప్పారు. భక్తులకు దర్శనం అనంతరం ఉత్సవవిగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తామని పేర్కొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఆంజనేయుడికి ఫలాల అలంకరణ

గుంతకల్లు, మే 31: దక్షిణాది హనుమజ్జయంతిని పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని శుక్రవారం ఉదయం పండ్లతో అలంకరించారు. వేకువనే స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు నిర్వహించారు. పండ్లతో అలంకరించి.. భక్తులకు దర్శనం కల్పించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో అష్టోత్తర శత కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అర్చన వేద, సుందరకాండ, మన్యుసూక్త పారాయణం, హోమాలు, స్వామివార్ల మూల మంత్ర జపాలను చేపట్టారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, సాయంత్రం మల్లెలతో లక్షార్చన, యాగశాలలో ఆరాధన నిర్వహించారు. వేదగోష్ఠి, హారతి కార్యక్రమాలను చేట్టారు. కార్యక్రమాలలో ఆలయ ఈఓ వై. భద్రాజీ, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కె.సుగుణమ్మ, ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



లక్షార్చన నిర్వహిస్తున్న దృశ్యం, ఫలాల అలంకరణలో ఆంజనేయస్వామి

పొగాకు వాడటమంటే మరణానికి దగ్గరవడమే..



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మే 31: పొగాకు వాడటం అంటే మరణానికి దగ్గరవ్వడమే అని దంత వైద్యుడు డా. భూపాళం విజయ్‌బాబు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల గుండెజబ్బులు వస్తాయన్నారు. జీర్ణక్రియ సరిగా పనిచేయక గ్యాస్ ట్రబుల్ లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. మానసిక వైద్య నిపుణులు రాజగోపాల్, డెంటిస్టు ఆయిషా, సైక్యాట్రిస్ట్ కౌన్సిలర్ రాణి, సీటలు ముస్తఫా, రమేష్, లోకేష్, రవి, తనూజా, నాగమణి ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

మడకశిర రూరల్, మే 31: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కర్ణాటక నైమిషారణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు. మండలంలోని నీలకంఠాపురం దేవాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. స్వామిజీకి ఆలయ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవాలయంలో స్వామి వారిని స్వామీజీ దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో శివకేశం లీలవిలాసం ప్రవచనం చేశారు. భక్తితోనే ముక్తి, భక్తి భావాలను పెపొందిస్తుందని అన్నారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది


అన్నదానం చేస్తున్న యోగినారాయణ సేవాసమితి సభ్యులు

హిందూపురం అర్బన్, మే 31: దానాలోకెల్లా అన్నదానం గొప్పదని యోగి నారాయణ సేవాసమితి హిందూపురం శాఖ సభ్యులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆర్చ్ ఎదురుగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎండలు మండుతున్న సందర్భంగా 40 రోజుల పాటు పాదచారులకు, వాహనదారులకు, ప్రజలకు మజ్జిగ, రస్నా, ఆరంజ్ జ్యూస్ అందించి దాహార్తి తీర్చారు. శుక్రవారం చెలివేంద్రాన్ని ముగించారు. సమితి హిందూపురం శాఖ అధ్యక్షుడు రవిశంకర్, శ్రీనివాసులు, అనూష, అఖిల్‌కుమార్, రాజు, బసప్ప, లక్ష్మీ, వెంకటేష్, గజేంద్ర పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

గోరంట్ల, మే 31: ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులకు శనివారం నుంచి తరగతులు ప్రారంభిస్తున్నామని, హాజరు కావాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంసీఈ, తెలుగు, ఇంగ్లీషుమీడియం గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని అర్హులైన వారు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

గోరంట్ల, మే 31: మండలంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో ఈఓఆర్డీ సుధాకర్‌తో కలిసి ఎంపీడీఓ శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా 11,591 పింఛన్లకు రూ.3,44,85,500 మంజూరైందన్నారు. ఇందులో గత నెలలో పంపిణీ చేసిన విధంగా 8,685పింఛన్లను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమచేయడానికి రూ.2,60,55,000 కేటాయించారని, మిగిలిన 2,906 పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా రూ.84,30,500 అందిస్తారన్నారు. డీపీఓ విజయక్‌కుమార్‌రెడ్డి హాజరై, స్వచ్ఛభారత్, జల్ జీవన్ మిషన్, ఇంటి పన్నులు, పారిశుధ్యంపై కార్యదర్శులతో సమీక్షించారు.

నేడు జాబ్‌మేళా

హిందూపురం, మే 31: శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బాలయేసు కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్ ఎక్స్ సంస్థ ద్వారా ఇప్పటికే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కర్ణాటకలోని కోలార్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన యాపిల్ ఫోన్ తయారీ సంస్థలో ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. దీంతోపాటు టాటా ఎలక్ట్రానిక్ సంస్థలో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. సత్యసాయి జిల్లాలోని యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారు సర్టిఫికెట్లతో బాలయేసు కళాశాలలో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9513133003 నంబరులో సంప్రదించాలన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

గోరంట్ల, మే 31: మండలంలోని జాతీయ రహదారిపై పాలసముద్రం సమీపంలో ఓల్వో బస్సు ఢీకొని నరసింహప్ప(58) శుక్రవారం మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కాటేపల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప పాలసముద్రం సమీపంలోని బెల్లాలచెరువు క్రాస్ వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా శుక్రవారం ప్రమాదం జరిగింది ఓల్వో బస్సు హైదరాబాద్‌నుంచి బెంగళూరు వెళ్తుండగా నరసింహప్పను ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందారు. నరసింహప్ప కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సంపత్ అంత్యక్రియలు పూర్తి

హిందూపురం, మే 31: హత్యకు గురైన ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్‌కుమార్ అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. బుధవారం రాత్రి సంపత్ కుమార్‌ను హత్యచేసి ధర్మవరం చెరువు కట్టవద్ద పడేసి వెళ్లిన ఘటన గురువారం వెలుగుచూసిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం శవపంచనామా నిర్వహించి హిందూపురానికి తరలించారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. సంపత్‌కుమార్ మృతి విష యం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ నేతలు రఘువీరారెడ్డి, శైలజనాథ్ మృత దేహానికి పుష్పగుచ్ఛం వుంచి నివాళులు అర్పించారు. కేరళ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు కూడా హిందూపురానికి చేరుకుని సంపత్‌కుమార్ మృతదేహంవద్ద నివాళులు అర్పించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న సంపత్‌కుమార్ నివాసం వద్ద నుంచి రైల్వే రోడ్డు మీదుగా ఎంజీఎం పాఠశాల ఎదురుగా క్రైస్తవ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు

మడకశిరటౌన్, మే 31: సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం మడకశిరకు పాఠ్యపుస్తకాలు చేరాయి. 44 వేల నోటు పుస్తకాలు, 17 వేల పాఠ్య పుస్తకాలు రాగా 8, 9, 10 తరగతులు మినహా మిగతా తరగతులకు సంబంధించిన పుస్తకాలు వచ్చాయని, ఇంకా కొన్ని రావాల్సి ఉన్నాయని తెలిపారు.


పుస్తకాల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ


ఇక్కడ చంపి.. అక్కడ పడేశారా?

- తీసుకెళ్లినవారే హతమార్చారా ?
- లేక పాత నేరస్థుల పనా..?
- హంతకులను పట్టుకునేందుకు రెండు బృందాల ఏర్పాటు

హిందూపురం, మే 31: ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను హిందూపురం ప్రాంతంలో హత్యచేసి ధర్మవరం వద్ద పడేసినట్లు పోలీసులు ఆనవాళ్లను గుర్తించినట్లు సమాచారం. బుధవారం రాత్రి సంపత్‌కుమార్‌ను అతని ఇంటి నుంచి తీసుకెళ్లిన గుర్తు తెలియని దుండగులు సరిహద్దులోని కర్ణాటక చింతలపల్లి సమీపంలో మద్యం సేవించి అక్కడికి కిలోమీటరు దూరం తీసుకెళ్లి మరోసారి మద్యం సేవించే సమయంలో హతమార్చి అదే వాహనంలో తీసుకెళ్లి ధర్మవరం చెరువు కట్టకింద మృతదేహాన్ని పడేసినట్లు శుక్రవారం పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

తీసుకెళ్లినవారే హతమార్చారా?

ఇదిలా ఉంటే బుధవారం రాత్రి సంపత్‌కుమార్‌ను తన ఇంటివద్ద నుంచి హిందూపురానికి చెందిన కారులోనే అతనికి కొద్దిరోజులుగా స్నేహితుడిగా ఉన్న యువకుడు తీసుకెళ్లాడు. ఆ వాహనంలో సంపత్‌తోపాటు నలుగురు వెళ్లినట్లు సమాచారం. వారు కర్ణాటక చింతలపల్లి వద్ద వైన్‌షాపులో మద్యం సేవించినట్లు తెలిసింది. అదిచాలక మరో రౌండ్ కోసం మద్యం బాటిల్ తీసుకెళ్లి అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో పారిశ్రామికవాడకు వెళ్లే కాలి బాటకు సమీపంలో మద్యం సేవించారని అక్కడి ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హిందూపురం నుంచి సంపత్‌కుమార్‌ను తీసుకెళ్లినవారు హతమార్చారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ తీసుకెళ్లినవారు ఇంతవరకు అలాంటి నేరాలకు పాల్పడినట్లు వారిపై అనుమానాలు లేవు. కానీ డబ్బుకోసం ఒకవేళ హతమార్చి ఉంటారా అన్న కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఇదే సందర్భంలో హిందూపురం నుంచి సంపత్‌ను తీసుకెళ్లినవారు కేవలం తీసుకెళ్లేందుకే ఉపయోగించుకున్నారా లేక పాత హంతకులు ఇందులో ఏమైనా కలిసి ఉంటారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం నుంచి తీసుకెళ్లిన యువకులు కొన్ని నెలల క్రితం జరిగిన హత్య కేసుకు సంబంధించిన వారితో పరిచయం ఉన్నట్లు పట్టణంలో చర్చించుకుంటున్నారు. అంతేకాక మెడపై, తలపై నరికిన ఆనవాళ్లు చూస్తుంటే గతంలో హత్యలు చేసిన వారి పనై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ కోణంలో కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు.


సంపత్‌కుమార్ (ఫైల్)

వైసీపీ నాయకుడిపై అనుమానం

సంపత్‌కుమార్ హత్యకు మునుపు వైసీపీ నాయకుడిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అనంతరం కూడా సంపత్‌కుమార్ తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నాయకుడు పేరు పేర్కొన్నారు. దీంతో గతం నుంచి ఆయన నేరచరిత్ర ఉన్న వారు హిందూపురంలో సదరు నాయకుడిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏ నలుగురు కలిసినా అతని గురించే చెప్పుకుంటున్నారు. ఆయన కొంతకాలంగా హిందూపురానికి దూరంగా ఉంటూ వచ్చారు. హిందూపురం నుంచి అధికార పార్టీ తరుపున బరిలో ఉన్న అభ్యర్థి తరపున ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన కొన్నిరోజులుగా ఇక్కడే మకాం వేసినట్లు సమాచారం. ఆయన పేరును బాధిత కుటుంబం ఫిర్యాదులో పేర్కొనడం అనుమానాలకు తావిస్తోంది.

రెండు బృందాల ఏర్పాటు

సంపత్‌కుమార్ దారుణ హత్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్రస్థాయిలో స్పందించారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సంపత్ హత్యపై ట్వీట్ చేశారు. అతన్ని అనుమానాస్పదమనడం కలిచివేసిందని అద్భుతమైన రాజకీయ భవితవ్యం ఉన్న నేత సంపత్‌కుమార్ అంటూ సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు రఘువీరారెడ్డి, శైలజానాథ్, హర్షకుమార్ స్పందించడంపై పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ నిందితులను పట్టుకోవాలని ధర్మవరం, హిందూపురం వన్‌టౌన్ సీఐలను రెండు బృందాలుగా ఏర్పాటుచేసి వారికి మరికొంతమంది సిబ్బందిని కేటాయించారు. వారు శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఈ కేసుపై దర్యాప్తు ప్రారంభించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే సంపత్‌ను తీసుకెళ్లిన యువకుల్లో ఒకరు ఉత్తరాది జిల్లాలో ఉన్నట్లు అనుమానించారు. అయితే ఈ కేసుకు సంబంధించి సంపత్‌కుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- ఆలనాపాలన లేక శిథిలావస్థలోకి..
- రూ.లక్షల ప్రజాధనం వృథా

చిలమత్తూరు, మే 31: ప్రజల అవసరాలకు నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటి ఆలనా పాలన కరువవడంతో పక్కా భవనాలు దెబ్బతింటున్నాయి. మండలంలో ఇలాంటి భవనాలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలు మూతపడటంతో ఆ భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొడికొండ చెక్‌పోస్టులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బలిజపల్లి, నంజిరెడ్డిపల్లి, సుబ్బరావుపేట, ముద్దపల్లి, వై.గొల్లపల్లి, దాదిరెడ్డిపల్లి తండా, మాదిరెడ్డిపల్లి గ్రామాల పాఠశాలలు మూతపడటంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. కోడూరులో పాత పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన పెద్ద భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కొడికొండ చెక్‌పోస్టు వద్ద గతంలో కమర్షియల్ సేల్‌ట్యాక్స్ కార్యాలయంగా ఏర్పాటు చేసిన కొత్త భవనం ఇప్పుడు పర్యవేక్షణ కరువైంది. దాంతో ఇప్పటికే భవనానికి ఉన్న కిటికీలు, వాకిళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆ పక్కనే ఉన్న రూ.కోట్లు విలువ చేసే ఏపీ టూరిజం శాఖకు చెందిన రెస్టారెంట్ భవనం శిథిలావస్థకు


నిరుపయోగంగా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం


కొడికొండ చెక్‌పోస్టులో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాల

చేరింది. నాలుగేళ్లుగా ప్రభుత్వం టెండర్లకు అవకాశం ఇవ్వకపోవడంతో దానిని పట్టించుకునేవారే కరువయ్యారు. దాంతో ఇప్పుడు ఆ భవనం దెయ్యాల భవనంగా మారింది. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖకు సంబంధించిన క్వార్టర్స్ ఒకప్పుడు ఎంతో అందంగా, ఉద్యోగులకు సౌకర్యంగా ఉండే భవనాలు ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటిలో ఉద్యోగులు నివాసం లేకపోవడంతో రూ.లక్షలు మట్టిపాలవుతున్నాయి. అదేదారిలో పోలీస్ క్వార్టర్స్, సిబ్బంది స్థానికంగా ఉండేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక క్వార్టర్స్ నిర్మించారు. ఆ భవనాలకు సరైన సమయంలో మరమతులు చేయకపోవడంతో శిథిలమయ్యాయి. దీంతో క్వార్టర్స్‌లో నివాసం ఉండటానికి ఉద్యోగులు ఆసక్తి చూపడంలేదు. దాంతో ఆ భవనాలు కూడా పాడైపోతున్నాయి. ఇలా ప్రభుత్వ భవనాలకు ఆలనా పాలన కరువవడంతో శిథిలావస్థకు చేరాయి.

ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలి

ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు కొన్ని కారణాలతో మూతపడ్డాయి. ఆ భవనాలను అలాగే వదిలేయకుండా ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు. ఉన్న భవనాలను అలాగే వదిలేస్తే శిథిలమడం తప్పా ఏ మాత్రం ఉపయోగపడవని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏ శాఖకు అవసరమైన వాటిని ఉపయోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జిల్లాస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

హిందూపురం అర్బన్, మే 31: జిల్లాస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి మహ్మద్ సలీం తెలిపారు. పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో శుక్రవారం జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుల జట్టు ఎంపిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 35 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మందిని ఎంపిక చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో వీరు పాల్గొంటారు. కార్యక్రమంలో పీడీలు లోక్‌నాథ్, రామాంజనేయులు, ఈసీ మెంబర్ విజయవాణి, కోచ్‌లు పాల్గొన్నారు.


ఎంపికైన ఫుట్‌బాల్ జట్టు

వరుస చోరీలతో జనం బెంబేలు..!

- ఇళ్లకు తాళాలు వేయాలంటే భయం.. భయం..
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

గోరంట్ల, మే 31: ప్రజలు ఇంటికి తాళం వేశారంటే చోరీ రూపంలో మూల్యం చెల్లించుకోవల్సిన పరిస్థితి గోరంట్ల పట్టణంలో నెలకొంది. అత్యవసర పరిస్థితిలో ఇంటికి రాత్రివేళ తాళం వేసి మరో ప్రాంతానికి లేదా మిద్దెపై నిద్రించినా, వారికి మూడినట్లే. దొంగల వీరవిహారం చేస్తున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి గోరంట్లలో నెలకుంది. మూడునెలలుగా వరుస చోరీల సంఘటనలే ఇందుకు ఉదాహరణ. పట్టణంలోని వినాయక్ నగర్‌లో చాకలి శ్రీనివాసులు మార్చి 5న ఇంటికి తాళం వేసి, ఇరుముడి కోసం శివాలయానికి వెళ్లి, గంటలోపు తిరిగిరాగా, అప్పటికే దుండగులు చోరీ చేశారని భార్య చాకలి శైలజ తెలిపారు. తాళం పగలకొట్టి బీరువాలోని ఐదు తులాల బంగారు నగలు, కుమారుడి ఫీజుకోసం దాచిన రూ.1.50లక్షల నగదు దుండగులు ఎత్తుకెళ్లారని వాపోయింది. బూడిదదిన్నెలోని చేనేత కార్మికుడు వేణుగోపాల్ ఇంటిలో ఏప్రిల్ 4న 35గ్రాముల బంగారు వస్తువులు, రూ.2 లక్షల నగదు చోరీ జరిగింది. అక్కడికి సమీపంలోని పంచాయతీ వాటర్ మ్యాన్ జయచంద్ర పట్టణంలోని కొళాయిలకు నీరు వదల డానికి వెళ్లారు. జయచంద్ర భార్య ఒక్కటే నిద్రించలేక, బంధువులింటికి వెళ్లగా 30గ్రాముల బంగారం, రూ.40వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే రోజు తెల్లవారుజామున బాలికల ఉన్నతపాఠశాల సమీపంలో శివకుమార్ ఇంటిముందుంచిన ఆటో చోరీ జరిగింది. ఏప్రిల్ 6న చలమయ్యగారిపల్లిలో ఎరుకుల నరేష్‌కు చెందిన రూ.2.10లక్షల విలువ చేసే 15 పందులను గుర్తుతెలియన వ్యక్తులు ఎత్తుకెళ్లారు. 20వతేదీన గోరంట్లకు చెందిన హేమాప్రతాప్ తీర్థయాత్రలకు వెళ్తుండగా హ్యాండ్‌బ్యాంగ్‌లోని 42గ్రాముల నక్లెస్ బస్టాండ్‌లో చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏప్రిల్ 24న రాత్రి రాజీవ్ కాలనీలోని నాలుగు నివాస గృహాల్లో చోరీలు జరిగాయి. కృష్ణరావు ఇంటిలో 65గ్రా. బంగారు నగలు, రూ.60వేలు నగదు చోరీ చేశారు. 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బంగా రు వ్యాపారి కేశవాచారీ, అతని దంపతులు తాళం వేసి సమీప గ్రామంలో సీమంతం కార్యక్రమానికి వెళ్లగా 150గ్రా. బంగా రు, రూ.4.10 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. 21న పులేరు రోడ్డు లో నివాసముంటున్న చేనేత కార్మికుడు వడ్డె క్రిష్టప్ప కుటుం బం తాళం వేసి తిరుపతికి వెళ్లి తిరిగి రాగా 67గ్రా. బంగారు నగలు, 40గ్రా. వెండి, రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి పాలస ము ద్రం గ్రామంలోని కెనరా బ్యాంక్ ఏటీఎం చోరీకి విఫల యత్నం చేశారు. ఏటీఎంలో ఏర్పాటు చేసి సెన్సార్ కారణంగా వెంటనే హెడ్ ఆఫీసర్‌కు సమాచారం వెళ్లగా, బ్యాంక్ మేనేజర్ లక్ష్మీపతినాయక్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే పోలీసులు స్పందించి సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా అదే గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తిని అదులోకి తీసుకున్నారు.


వడ్డె కిష్టప్ప ఇంటిలో చెల్లాచెదురైన దుస్తులు (ఫైల్)

చోరీలపై ప్రత్యేక దృష్టి



గోరంట్లలో చోరీలు జరుగుతున్నా, పోలీసులు ఎన్నికల విధినిర్వాహణలో ఉండటం వల్ల తీరిక లేకపోవడంతో వారి ఆటలు సాగుతున్నాయి. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తరువాత చోరీలపై ప్రత్యేక దృష్టి సారించి, అరికడతాం.

\- బాజీజాన్‌సైదా డీఎస్పీ, పెనుకొండ

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

హిందూపురం అర్బన్, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యతగా అందించాలని ఎంఈఓ గంగప్ప, ఎంఈఓ-2 ప్రసన్న లక్ష్మీ సూచించారు. మధ్యాహ్న భోజన హెల్పర్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక అజీజియా పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యతగా వంట ఎలా వండాలి అనే విషయంపై వారికి అవగాహన కల్పించారు. పోషక విలువలు గల పదార్థాలను ఉపయోగించి వంట చేయాలని సూచించారు. పాఠశాలల్లో మెనూప్రకారం భోజనం అందించాలన్నారు. రుచికరంగా వంట వండిన మొదటి ముగ్గురిని ఎంపిక చేసి వారికి ప్రోత్సాక బహుమతులు అందించారు. అజీజియా పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీకి మెదటి బహుమతి, ముద్దిరెడ్డిపల్లి పాఠశాలలో పని చేస్తున్న లక్ష్మీదేవికి రెండో బహుమతి, పొట్టి శ్రీరాములు పాఠశాల ఏజెన్సీ వారికి మూడో బహుమతి అందించారు. ఏఆర్పీ వెంకటలక్ష్మీ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తౌసీఫ్, ప్రవీణ్‌కుమార్, సురేష్‌బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వరుడికి సహస్ర దీపాలంకరణ సేవ


సహస్ర దీపాలంకరణ సేవలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

పెనుకొండ టౌన్, మే 31: పట్టణంలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. శుక్రవారం స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. నిత్యారాధన, నిత్యహోమబలి, అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణసేవ, కీర్తనలు, పార్వేటోత్సవం, అశ్వవాహనోత్సవ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా లక్ష్మీ నిడిమామిడమ్మ దేవి ఉత్సవం

మడకశిర రూరల్, మే 31: మండలంలోని జమ్మానిపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీ నిడిమామిడమ్మ దేవి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.


అలంకరణలో అమ్మవారు

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

హిందూపురం అర్బన్, మే 31: మండలంలోని మిట్టమీదపల్లిలో శనివారం బైలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హోమాలు, ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదం, శనివారం హనుమజ్జయంతి సందర్భంగా బైలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు

మడకశిరటౌన్, మే 31: హనుమజ్జయంతిని పురస్కరించుకొని శనివారం జరిగే వేడుకలకు ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబు చేశారు. శుక్రవారం మారుతీనగర్‌లో వెలిసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా తెరిచిన సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహాలకు సంప్రోక్షణ చేశారు. ఆలయంలో కలశార్చన, గణపతి హోమం, హోమాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 12గంటలకు హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. సాయత్రం 4 గంటలకు సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహాలతో గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మిట్టబండ ఆంజనేయస్వామి, వివిధ దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేశారు.


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు


బూదిలిలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

గోరంట్ల: మండలంలోని బూదిలి గ్రామంలో కాడిమాను ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను శుక్రవారం ప్రారంభించారు. రెండురోజులపాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీకాంతం, శేఖర్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గంగపూజ, గోపూజ, గణపతి పూజ, వాస్తువరుణ పూజ, రక్షాబంధనం, కలిశ స్థాపన, నవగ్రహ ఆరాధన, హోమాలు, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సీతారాముల కళ్యాణహోత్సవం నిర్వహిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని అర్చకులు కోరారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

మడకశిరటౌన్, మే 31: ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బాజీజాన్‌సైదా హెచ్చరించారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని, ఎవరైనా గొడవలు, అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా అధికారుల ఆదేశాలు అతిక్రమించినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. సీఐ మనోహర్, రాజశేఖర్, ఐదు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

లేపాక్షి,: ఓట్ల లెక్కింపు జరుగుతున్న దృష్ట్యా మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు డీఎస్పీ కంజక్షన్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ హెచ్చరికలు బేఖాతరుచేస్తే జిల్లా బహిష్కరణ చేస్తామని ఆయన అన్నారు. ఎస్ఐ గోపీ, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరిపాళ్యంలో పోలీసు తనిఖీలు

పెనుకొండ: ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో ఉంచుకుని మండలంలోని వెంకటగిరిపాళ్యం గ్రామంలో పోలీసులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. కియ ఎస్ఐ రంగడు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి గ్రామంలో కార్డెన్ సర్చ్ చేశారు. అనుమానం ఉన్న ఇళ్లలో, గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు. 4వ తేదీ వరకు గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.